19 Aug '99

# చర్చ కూడా కోర్టు ధిక్కారమేనా?

**ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ ఒక అంగం మాత్రమే. పత్రికలు మరొకటి. చట్టసభలు ఇంకొకటి. ప్రజాభిప్రాయం వీటన్నింటికంటె మౌలికమైనది. వీటిలో ఒకరి దగ్గరకొచ్చిన వారు మరొకరి దగ్గరకు పోకూడదనడంలో అర్ధమేముంది? అన్నీ కలిస్తేనే ప్రజాస్వామ్యం అవుతుంది.**



కె.బాలగోపాల్

నర్మదా బచావ్ ఆందోళన్ నాయకురాలు మేధాపాట్కర్‌పైన, ప్రముఖ రచయిత్రి అరుంధతిరాయ్ పైన సుప్రీంకోర్టు కోర్టు ధిక్కార నేరానికి చర్య తీసుకోవాలని గుజరాత్ రాష్ట్రప్రభుత్వం కోరడాన్ని కడుపుమంటగా అర్థంచేసుకోవచ్చు. కానీ గుజరాత్ ప్రభుత్వం అడిగినా అడగకున్నా తానే చర్యతీసుకోవడానికి సిద్ధమవుతున్నట్టు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి మాట్లాడడం కొంచెం ఆశ్చర్యమే కాక ఆందోళనకూడా కలిగించే విషయం.

చీఫ్ జస్టిస్ ఆనంద్ న్యాయశాస్త్ర పాండిత్యాన్ని గురించి ఎవరికీ సందేహాలు లేవు. ఆ పాండిత్యాన్ని కోర్టుకు రాలేని మూగ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ఆయన ఉపయోగించిన ఉదంతాలూ ఉన్నాయి. నర్మదా నదిపైన గల గుజరాత్ ప్రభుత్వం తలపెట్టిన ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులు కాగల ఆదివాసీలూ ఇతరపేద ప్రజలూ ఆయన కోర్టులో ఎంతో కొంతన్యాయం దొరుకుతుందని సహేతుకంగానే ఆశ పెట్టుకోవచ్చు.

కానీ అంతమాత్రం చేత 'కోర్టుకొచ్చావు కాబట్టి ఇంకా బయట ఎక్కడా మాట్లాడ వద్దు' అని, కోర్టు ఇచ్చే ఆర్డర్లపైన బహిరంగంగా విమర్శపెట్టొద్దు అనీ అనడాన్ని సహేతుకమైన ఆదేశంగా స్వీకరించడం కష్టం.

'కోర్టుధిక్కారం' అనే నేరానికి సంబంధించిన న్యాయశాస్త్ర సిద్ధాంతచర్చను కొంత సేపు పక్కనపెడదాం. తమ కొంప గోడు కోల్పోయే పరిస్థితిదాపురించిన వారు ఇటువంటి ఆదేశాలను పాటించడం సాధ్యమవుతుందా? తమ జీవితాన్ని కాపాడుకోవటం కోసం వాళ్ళు దొరికిన అవకాశాలనూ అందుబాట్లో ఉన్న అన్ని వేదికలనూ వాడుకుంటారు. వాడుకోవటంలో వారు అహేతుకంగానో అన్యాయంగానో ప్రవర్తిస్తే వారిని ఎవరు తప్పు పట్టినా ఫరవాలేదు గానీ 'మా దగ్గరకు వచ్చావు కాబట్టి ఇంక మమ్మల్నే నమ్ముకొని ఉండ' మనడంలో అర్థలేదు. న్యాయస్థానానికి అర్హతగల గౌరవం ఇయ్యవలసిందేగాని అది ఒకానొక చారిత్రక దశలో మనుషులు తమ సమస్యలపరిష్కారం కోసం ఏర్పాటు చేసుకొన్న ఒకానొక వ్యవస్థమాత్రమే నని గుర్తించక దానిని సత్యానికీ న్యాయానికీ ఒక అంతిమ ప్రమాణంగా భావించడం విజ్ఞులకు తగదు.

అయినా, ప్రజాస్వామ్యంలో న్యాయవ్యవస్థ ఒక అంగం మాత్రమే. పత్రికలు మరొకటి. చట్టసభలు ఇంకొకటి. ప్రజాభిప్రాయం వీటన్నింటికంటె మౌలికమైనది. వీటిలో ఒకరి దగ్గరకొచ్చిన వారు మరొకరి దగ్గరకు పోవద్దనడంలో అర్థమేముంది? అన్నీ కలిస్తేనే ప్రజాస్వామ్యం అవుతుంది. అన్నీ కల్పించే అవకాశాలను ప్రజలు వాడుకుంటారు. వాడుకున్నప్పుడే హక్కులకు కొంత మేరకైనా రక్షణ ఉంటుంది.

ఒక అభ్యర్థనతో కోర్టులో కేసు వేసిన వారు అదే అభ్యర్థనను అసెంబ్లీ ముందో పార్లమెంటు ముందో పెట్టి చట్టం చేయమని అడిగారనుకోండి. దానిని కోర్టు ధిక్కారంగా సుప్రీంకోర్టు భావిస్తుందా? 'మా దగ్గర కొచ్చిన తరువాత మళ్ళీ ఎంఎల్ఏల చుట్టూ ఎందుకు తిరుగుతున్నావు?' అంటుందా?

అనదు. తమ అభ్యర్థనలకు వ్యవస్థిత రూపం సాధించుకోవడానికి న్యాయస్థానాలదగ్గర కొచ్చినట్టే చట్టసభల దగ్గరకు పోవచ్చుననీ హక్కుల సాధనకు ఇవి ప్రత్యామ్నాయ వేదికలనీ గుర్తింపు ఉంది. ప్రజాభిప్రాయానికి మాత్రం ఎందుకు లేకుండా పోయింది? కోర్టుకు తమ సమస్యలు తీసుకొచ్చిన వారు ఆ సమస్యలను ప్రజాభిప్రాయం ముంగిటికి ఎందుకు తీసుకుపోకూడదు? బలమైన ప్రజాభిప్రాయాన్ని మించిన సాధనం ప్రజాస్వామ్యంలో వేరే ఏదైనా ఉండగలదా? ఆ అవకాశం పైన నిషేధం ఎందుకు?

నిజానికి నర్మదా ఆందోళనకారులు లేవదీస్తున్న ప్రశ్నలలో న్యాయస్థానాలు



జవాబు చెప్పగలిగినవి కొన్నే. ప్రాజెక్టు నిర్మాణం అంటూ జరిగితే నిర్వాసితులకు ఏ రకమైన పునరావాసం ఇవ్వాలి, లేదా ఎంత నష్టపరిహారం ఇవ్వాలి అనే విషయాలను కోర్టులు (నిర్ణయించదలచుకుంటే) నిర్ణయించగలవు. ఈ వివాదాన్ని కోర్టుకు తీసుకుపోవడం వల్ల ప్రభుత్వం పైన కూడా ఒత్తిడి పెరిగి మామూలుగా ఇచ్చేదానికంటే కొంత కాకపోతే కొంతఎక్కువ ఇస్తుందనేది కూడా సత్యమే. ఈ వాస్తవాన్ని గుర్తించబట్టే ప్రజలు కోర్టు కొస్తారు. ఈ మేరకు కోర్టులు న్యాయం సమకూర్చగలవు కాబట్టి ఈ మేరకు కోర్టులను గౌరవిస్తారు కూడా.

కానీ ఇంతకంటె ఎక్కువ విధేయత ప్రజలనుండి డిమాండ్ చేయడం సబబా? ఆందోళన కారులు వేస్తున్న ప్రశ్నలలో న్యాయస్థానాలు జవాబు చెప్పలేనివి చాలా ఉన్నాయి. ఒక్కసారిగా ఎక్కువ మొత్తంలో పెట్టుబడి పెట్టి పెద్ద నదులమీద పెద్దపెద్దప్రాజెక్టులు కట్టి ఒకేసారి లక్షల ఎకరాలను సాగులోకి తీసుకొచ్చి అదే క్రమంలో లక్షల మందిని నిర్వాసితులు చేయడం మంచిదా? లేక కొంతఎక్కువ సమయం తీసుకున్నా ఒకేసారి లక్షల ఎకరాలు సాగులోకి తేలేకున్నా పెద్దనదులమీదకాక వాటిలోకి నీరు చేరవేసే ఉపనదులు వాగుల మీద చిన్న ప్రాజెక్టులు ఎక్కువ సంఖ్యలో కట్టి ఎక్కువ మందిని నిర్వాసితులు చేయకుండా పొందగలిగిన ప్రయోజనం పొందడం మంచిదా? ఈ ప్రశ్న న్యాయస్థానాలను అడిగితే అది తాము తేల్చగలిగింది కాదనీ అది ప్రభుత్వ పాలసీకి సంబంధించిన విషయమనీ అంటారు. మరి ఆ పాలసీని ప్రభావితం చేయడానికి ప్రజాభిప్రాయాన్ని కూడగట్టే లక్ష్యంతో ఉద్యమ కారులు కోర్టు బయట కూడా సంవాదం, ఆందోళన కొనసాగించవలసిన అవసరం లేదా?

ముంపుకు గురయిన ప్రాంతాల ప్రజలకు ఇచ్చే నష్టపరిహారం గురించిఇప్పటిదాకా ప్రభుత్వానికి ఉండే పాలసీ ఏమిటంటే ముంపు ప్రాంతంలో స్థిరాస్తులుండి వాటిని పోగొట్టుకున్న వారికి మాత్రం నగదు రూపంలో నష్టపరిహారం వస్తుంది. చరాస్తి (ఉదాహరణకు గొర్రెలు, మేకలు) మాత్రమే ఉండేవారు, ప్రకృతి వనరులపైన (ఉదాహరణకు చేపలు పట్టుకోవడానికి చెరువులు, కుంటలు, కల్లుతీసి అమ్ముకోవడానికి ఈతచెట్లు, తాడిచెట్లు) ఆధారపడి బతికేవాళ్ళు ఇతరుల చేలల్లో కూలిచేసుకుని బతికేవాళ్ళు.. కొత్తప్రాంతానికి వలసపోయి జీవనం సంపాదించుకోవడం చాలా కష్టం. కానీ ప్రాజెక్టు కింద ఇచ్చే నష్టపరిహారంలో వారికి వాటా ఉండదు. ఇది తప్పనీ, పోగొట్టుకున్న ఆస్తికి నష్టపరిహారం కాక కోల్పోయిన జీవనానికి పునరావాసం ఇచ్చే విధానం ఉండాలనీ ఆందోళనకారులు అడగొచ్చు. అది కూడా ప్రభుత్వ పాలసీకి సంబంధించిన విషయమనీ న్యాయస్థానాలు ఏమీ చేయలేవనీ కోర్టులన్నాయనుకోండి. అప్పుడు బయట దీని గురించి ఆందోళనకారులు మాట్లాడనక్కరలేదా? ప్రభుత్వ పాలసీని మార్చే పద్ధతిలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టనవసరం లేదా?

అంతేకాదు. ఇటువంటి విషయాలలో న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవన్న అభిప్రాయాన్నే ఆందోళనకారులు తిరస్కరించకూడదా? న్యాయస్థానాలు జోక్యం చేసుకోవల్సిందేననీ ఆ అవకాశం భారత రాజ్యాంగంలో ఉందనీ వాదించి ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేయాలనుకోవడం 'కోర్టుధిక్కారం' అవుతుందా? అనేక విషయాలలో ఒక దశవరకు ఇది కోర్టులపరిధిలో లేదు అన్న న్యాయస్థానాలు ఆతరువాత ఆ విషయం తమ పరిధిలో ఉందని తీర్పులిచ్చాయి. అంతకు ముందు అదే విషయాన్ని కోర్టు ముందు వాదించి భంగపడినవారు ఉంటారు. వారు ఆ భంగపాటును మౌనంగా స్వీకరించకుండా ప్రజలలో చర్చకు పెట్టడం కోర్టు ధిక్కారం అవుతుందా? పెట్టినప్పుడే సంవాదానికి విస్తృత ప్రాతిపదిక ఏర్పడి ఆ అభిప్రాయాన్ని న్యాయస్థానాలు మరింత సీరియస్‌గా తీసుకొని కొత్తకోణం నుండి చూసే ప్రయత్నం చేస్తాయేమో కదా? అసలు కోర్టు బయట సంవాదమేమీ లేకుండానే న్యాయశాస్త్రం పురోభివృద్ధి సాధిస్తుందని నమ్మడం ప్రాథమికంగానే తప్పు కాదా?

ఏ విషయాలయితే 'మా పరిధిలో లేవు' అని సుప్రీంకోర్టు ఈరోజు అంటున్నదో ఆ విషయాలు కోర్టు పరిధిలో ఉన్నాయని గతంలో ఇదే కోర్టు ఇచ్చిన తీర్పులను ఆధారం చేసుకొని వాదించవచ్చు. ఆ వాదన కోర్టు లోపలవిఫలమైతే బయట దానిని కొనసాగించడం కోర్టు ధిక్కారమవుతుందా? లేకపోతే ఒక మంచి సూత్రీకరణను బతికించుకునే ప్రయత్నం అవుతుందా?

ఎప్పుడో కాదు, కేవలం మూడేళ్ళ కిందట జస్టిస్ కుల్దీప్‌సింగ్ పర్యావరణానికి సంబంధించిన ఒకతీర్పు ఇస్తూ నదులు, సరస్సులు, అడవులు, కొండలు మొదలయిన ప్రకృతి వనరుల విషయంలో ప్రభుత్వం ప్రజల తరపున ఒక 'పబ్లిక్ ట్రస్టీ'గా వ్యవహరించాలని అన్నారు. అంటే ఆ వనరుల పైన ఆధారపడి బతుకుతున్న ప్రజల ప్రయోజనాలు దెబ్బతినే రీతిలో వాటిని ఇతరులకు ధారాదత్తం చేయకూడదని అర్థం. ప్రభుత్వం ప్రజల తరపున ట్రస్టీగా వ్యవహరిస్తున్నదా లేదా అని న్యాయస్థానాలు పర్యవేక్షించవచ్చునని ఆయన ఆ తీర్పులో అన్నారు. దానిని ఆధారం చేసుకొని మొత్తంగానే నర్మదానదిపైన గుజరాత్ ప్రభుత్వం తలపెట్టిన భారీ ప్రాజెక్టుల విజ్ఞతను సుప్రీంకోర్టు పరిశీలించవచ్చునని వాదించే అవకాశం ఉంది. ఆ వాదన కోర్టు లోపల నెగ్గక పోతే దానిని బయట కొనసాగించడం జస్టిస్ కుల్దీప్ సింగ్ ప్రతిపాదించిన ఒక మంచి సూత్రాన్ని సజీవంగా ఉంచే ప్రయత్నం అవుతుంది.

న్యాయస్థానాల ప్రతిష్ఠను దిగజార్చే విధంగా మాట్లాడితే అది కోర్టు ధిక్కారం అవుతుందని శాస్త్రం చెప్తుంది. దానికి శిక్ష అవసరం అంటుంది. న్యాయస్థానాలకు ఉండే సున్నితమైన స్థానం దృష్ట్యా వేరే ఏ వ్యవస్థకూ లేని అధికారం న్యాయస్థానాలకుండాలన్న వాదనలో కొంత పసలేకపోలేదు గానీ న్యాయస్థానాలు తమ ప్రతిష్ఠకు భంగం కలగకుండా వ్యవహరించడమే వాటి ప్రతిష్ఠను కాపాడుకోవడానికి తగిన మార్గం తప్ప విమర్శను కోర్టుధిక్కారంగా పరిగణించే అధికారం వాటికి కట్టబెట్టడం కాదు. న్యాయస్థానాల ఆదేశాలను అతిక్రమించే చర్యలకు మాత్రమే కోర్టుధిక్కార నేరాన్ని పరిమితం చేయాలి తప్ప విమర్శకూ న్యాయసిద్ధాంత సంవాదానికీ దానిని వర్తింపచేయకూడదు.

అరుంధతీరాయ్, మేధాపాట్కర్‌లు సుప్రీంకోర్టు ప్రతిష్ఠను దిగజార్చే విధంగా విమర్శ, చర్చ పెడుతున్నారన్నది ఎంత వాస్తవమో గానీ వారిపైన కోర్టుధిక్కారం కేసు పెట్టి శిక్ష వేస్తే మాత్రం సుప్రీం కోర్టు ప్రతిష్ఠ నిజంగానే దిగజారుతుంది. ఆ సంగతి చీఫ్ జస్టిస్ ఆనంద్ గారికి తెలియనిదికాదు.